క్లుప్తంగా

కౌన్సిలర్ తండ్రికి పరామర్శ



గోరకాటి మల్లిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: పట్టణంలోని 24వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తంరెడ్డి తండ్రి గోరకాలి మల్లిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బుధవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీఓ లలితమ్మ

బత్తలపల్లి: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై నర్సింగ్ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అధికారులు, వైద్యులు సూచించారు. బుధవారం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలోని నర్సింగ్ కళాశాలలోని విద్యార్థినులకు ఇన్‌చార్జ్ సీడీపీఓ లలితమ్మ అధ్యక్షతన ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, డీసీపీఓ ప్రొటెక్షన్ ఆఫీసర్ మహేష్, బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీణ జోసఫ్ మాట్లాడారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిర్మూలన చట్టం –1994 గురించి వివరించారు. చట్టం అమలులో నర్సింగ్ విద్యార్థినుల విధులు, బాధ్యతలు తెలియజేశారు. అనంతరం బాల్య వివాహ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ కౌన్సిలర్ శోభ, బాలల సంరక్షణ విభాగం సిబ్బంది నాగలక్ష్మీ, ప్రసన్నలక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎర్రమ్మ, నర్సింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బత్తలపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బత్తలపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ సూచించారు. బుధవారం సంగాలలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, పరిసరాల పరిశుభ్రతపై వైద్యాధికారి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జ్వరాల సర్వే, లార్వా సర్వే చేసి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 9 మందికి చికిత్సలు అందించారు. జ్వరాల నియంత్రణకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సచివాలయ సెక్రటరీ సహకారంతో దోమల నియంత్రణకు మిలాథిన్ మందును స్ప్రే చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజశేఖర్, సూపర్‌వైజర్లు అశ్వర్థనారాయణ, గౌరమ్మ, సచివాలయ సెక్రటరీ మహమ్మద్ హాజిత్, ఆరోగ్య కార్యకర్తలు డేవిడ్, మారుతి, రత్నమ్మ, హెల్త్ ప్రొవైడర్ లిఖిత, ఆశా కార్యకర్త సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారానికి చొరవ చూపాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఆర్డీఓ మహేష్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రస్తుతం ఎదురవుతున్న అత్యవసర సమస్యలు, ప్రాధాన్యమైన పనులు, పెండింగ్ సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై దృష్టి సారించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నేరుగా పనిచేసే రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు, వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లు సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించాలని ఆదేశించారు.

ప్రమాదకర ప్రయాణం



ఫుట్‌బోర్డుపై నిలబడిన ప్రయాణికులు

చెన్నేకొత్తపల్లి: ముష్టికోవెల నుంచి ధర్మవరం ఆర్టీసీ ఒకే సర్వీసు నడుపుతోంది. దీంతో ఆ బస్సు నిత్యం రద్దీగా ఉంటోంది. బుధవారం కూడా బస్సు కెపాసిటీకి మించి ప్రయాణికులు ఎక్కారు. ఈ క్రమంలో కొందరు ప్రయాణికులు ఫుట్‌బోర్డుపై ప్రయాణం ప్రమాదమని తెలిసినా తప్పని పరిస్థితుల్లో చెన్నేకొత్తపల్లి వరకూ అలాగే వచ్చారు. ఫుట్‌బోర్డుపై ఉన్న ప్రయాణికులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. మలుపుల వద్ద తూలి పడినా ప్రాణాలకే ప్రమాదం. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి రద్దీ తగ్గట్టుగా బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- పల్లెల్లో లోపించిన పారిశుధ్యం
- పెరిగిపోయిన దోమల మోత
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



వేల్పుమడుగులో అపరిశుభ్రత ఇలా..



రోగులతో కిటకిటలాడుతున్న ఆర్డీటీ ఆసుపత్రి



బత్తలపల్లి పీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు విష్ణువర్ధన్

బత్తలపల్లి: సీజనల్ వ్యాధులు ముప్పేట దాడి చేస్తున్నాయి. రెండు నెలలుగా వర్షాలు కురుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించింది. మురుగు ముందుకు కదలక ఎక్కడికక్కడ నిలిచిపోయి దోమలకు ఆవాసంగా మారాయి. దీంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్ గన్యాతో పాటు వైరల్ ఫీవర్ బారినపడి జనం ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఆర్డీటీ ఆస్పత్రికి జ్వరపీడితులు పోటెత్తుతున్నారు. ఆర్‌ఎంపీల వద్దకు కూడా క్యూ కడుతున్నారు. ఆర్డీటీ ఆస్పత్రిలో చిన్నారులకు బెడ్లు దొరకని పరిస్థితి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణంగా ఓపీ 90 నుంచి 100 ఉంటుంది. అయితే రెండు వారాల నుంచి ఆ సంఖ్య 150 నుంచి 160కి చేరుకుందని వైద్యులు తెలిపారు. వైరల్ జ్వరానికి సంబంధించి 8–9 మంది వస్తున్నారని పేర్కొన్నారు. వైరల్ జ్వరానికి సంబంధించి డెంగీ, చికున్‌గన్యా పరీక్షలు చేయించినా నెగిటివ్ వస్తుందని, అయితే జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు, వాపులతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. నూతన వైరల్ ఫీవర్‌కు ప్రత్యేక మందులేవీ లేవని, పది రోజులు గడిస్తే సాధారణంగానే అదే తగ్గిపోతుందని తెలిపారు.

నిర్లక్ష్యంతో ప్రమాదం...

వాతావరణంలో వస్తున్న మార్పుల సమయంలో పరిసరాల అపరిశుభ్రతతోనే వ్యాధులు సోకే అవకాశం ఉంది. ప్రధానంగా దోమల నివారణతోనే పలు వ్యాధుల నుంచి ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. జ్వరం, దగ్గు, జలుబు సాధారణంగా ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశం ఉంది. దోమల ప్రభావంతోనే అంటు వ్యాధులు వస్తున్న నేపథ్యంలో ముఖ్యంగా దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. దోమలతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గన్యా, మెదడువాపు వంటి వ్యాధులు సోకుతాయి.

జ్వరాలన్నీ డెంగీ కాదు..

ఎలీసా రక్త పరీక్షల్లో నిర్ధారణ అయితేనే డెంగీ జ్వరంగా గుర్తిస్తారు. దానికి మాత్రమే చికిత్స అవసరం. మిగతావన్నీ సాధారణ జ్వరాలే. రాత్రి పూట కుట్టే దోమలకంటే పగటి పూట దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెంగీ దోమలు ఎక్కువగా పగటి పూట మాత్రమే కుడతాయి. ప్రధానంగా పిల్లలకు మాత్రమే దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పిల్లలకు దోమలు కుట్టకుండా కాళ్లు, చేతులు పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు తొడగాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. కాచిన నీటిని తాగాలి.

–డాక్టర్ విష్ణువర్ధన్, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బత్తలపల్లి

పోలా రామాంజనేయులు సేవలు చిరస్మరణీయం



పోలా రామాంజనేయులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ధర్మవరం: చేనేత కార్మిక సంఘం నాయకుడు పోలా రామాంజనేయులు ప్రజా సమస్యలపై చేసిన సేవలు చిరస్మరణీయమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో బుధవారం పోలా రామంజనేయులు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయూబ్‌ఖాన్, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, ఆదినారాయణ, హైదర్‌వలి, జేవీవీ జిల్లా కార్యదర్శి లోకేష్, ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు గుంపు హరి, ఖాదర్‌బాషా, వెంకటస్వామి, అన్నం సూరి, పులిచెర్ల హరి, చౌడయ్య, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బాబు, ముకుంద, ఓబులేసు, వెంకటరాముడు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోండి

బత్తలపల్లి: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను రైతులు ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించాలని ధర్మవరం ఏడీఏ లక్ష్మానాయక్ సూచించారు. బుధవారం ఎం.చెర్లోపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ మాట్లాడుతూ సాగులో పాటించాల్సిన సూచనలు తెలియజేశారు. అనంతరం రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి ఉపేంద్రరెడ్డి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ దిష్టిబొమ్మ దహనం

ఓడీచెరువు: ప్రధాని మోదీ తల్లిని అకారణంగా దూషించినందుకు నిరసనగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు బుధవారం ఓడీచెరువులో దహనం చేశారు. రాహుల్ బేషరతుగా మోదీ మాతృమూర్తికి క్షమాపణ చెప్పాలని బీజేపీ మండల అధ్యక్షుడు వీరాంజినేయులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు డాక్టర్ హరికృష్ణ, సీనియర్ నాయకులు రంగారెడ్డి, రమణయ్య,కిష్టప్ప, నాగప్ప, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఓడీచెరువు : మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు ఖాతాదారులు, రైతులు, మహిళా సంఘం సభ్యులు, గ్రామీణ ప్రజలకు బ్యాంకు ఖాతాలు, ఆధార్ అనుసంధానం, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి, ఈ-కేవీసీ గురించి వివరించినట్లు ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ చలం తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బ్రహ్మాచారి, ఓడీచెరువు సీఈఓ రామ్మోహన్, అమడగూరు పీఏసీఎస్ సిబ్బంది నాగవేణి, వెలుగు సిబ్బంది వేణుగోపాల్, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ధర్మవరం అర్బన్: ప్రజలకు నాణ్యమైన భోజనం అందించాలని ఆర్డీఓ మహేష్ తెలిపారు. పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను బుధవారం ఆర్డీఓ తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, పరిశుభ్రత, హైజీన్ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ప్రజలతో ఆహారం నాణ్యత, రుచి, పరిమాణంపై ఆరా తీశారు.

జయరాంను బర్తరఫ్ చేయాలి

పుట్టపర్తి టౌన్: రైతుసంఘం నేత ప్రభాకర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను బర్తరఫ్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పుట్టపర్తిలోని సీపీఎం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. గుత్తి మండలం బేతాపల్లిలో సోలార్ కోసం భూములు లాగేసుకోవడంతో నష్టపోతున్న రైతుల పక్షాన పరిశీలించడానికి వెళ్లిన ప్రభాకర్‌రెడ్డిపై ఎమ్మెల్యే అవమానకరంగా మాట్లాడటం తగదన్నారు. ఎమ్మెల్యేను సస్పెండ్ చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, మున్సిపల్ వర్కర్ల యూనియన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ,సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి, కొత్తచెరువు మండల కార్యదర్శి ముత్యాలు, పైపల్లి గంగాదర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆ భూములు.. ఆలయానివే'

తలుపుల: ఓబులేశ్వరస్వామి మాన్యం నుంచి ఎస్సీ కార్పొరేషన్ కొనుగోలు చేసిన భూమి తిరిగి ఆలయ మాన్యానికే స్వాధీనమైనట్లు ఈఓ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వేపమానిపేట పంచాయతీ గంజివారిపల్లి సమీపంలో గల కొండపై వెలసిన ఓబులేశ్వరస్వామి దేవస్థానానికి సర్వే నంబర్ 901లో 88.45 ఎకరాల విస్తీర్ణం పైకి 66 ఎకరాల భూమిని గతంలో ఎస్సీ కార్పొరేషన్‌కు విక్రయించారు. అయితే ఈ అమ్మకం ఒప్పందం రద్దు పరచాలని అర్చకుడు జి. శ్రీనివాసులు హైకోర్టును సంప్రదించారు. వాద ప్రతివాదనలు విన్న హైకోర్టు గతంలో ఎస్సీ కార్పొరేషన్ చేసుకున్న భూముల అమ్మకం ఒప్పందాన్ని రద్దు చేస్తూ.. వారి నుంచి తీసుకున్న మొత్తాన్ని తిరిగి ఇచ్చేయాలని తీర్పు చెప్పింది. ఆ మేరకు కార్పొరేషన్‌కు డబ్బు వెనక్కు ఇచ్చి, వారి నుంచి ఎన్‌ఓసీ తీసుకున్న దేవదాయ శాఖ అధికారులు 15.5.2023లో మాన్యం భూములను బహిరంగ వేలం పాట నిర్వహించి హెచ్చుపాటదారు సి.పాపులమ్మకు మూడేళ్ల కాలవ్యవధితో కౌలుకు కేటాయించారు. ఇకపై ఓబులేశ్వరస్వామి మాన్యం భూములపై ఎస్సీ కార్పొరేషన్‌కు గానీ, కార్పొరేషన్ తరఫు లబ్ధిదారులకు గానీ ఎటువంటి సంబంధమూ లేదని ఈఓ స్పష్టం చేశారు.

నూతన మూల్యాంకన విధానం రద్దుకు డిమాండ్



ఏపీటీఎఫ్ బత్తలపల్లి మండల నూతన కార్యవర్గంతో ఉపాధ్యాయులు

బత్తలపల్లి: నూతన మూల్యాంకన విధానం రద్దు చేసి ఉపాధ్యాయులకు బోధన చేసే అవకాశాన్ని కల్పించాలని ఏపీటీఎఫ్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బత్తలపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఏపీటీఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్, రాష్ట్ర నాయకులు బీకే ముత్యాలప్ప మాట్లాడుతూ పీఆర్సీని వెంటనే నియమించి ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు.

ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం

సర్వసభ్య సమావేశంలో ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కె.బలరాముడు వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్, రాష్ట్ర నాయకులు బీకే ముత్యాలప్ప హాజరయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. బత్తలపల్లి మండల గౌరవ అధ్యక్షునిగా తిమ్మప్ప, అధ్యక్షునిగా బి.గోపాల్, ప్రధాన కార్యదర్శిగా కె.నాగశేషణ, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరయ్య, శ్రీలక్ష్మి, నాగోజీరావు, కార్యదర్శులుగా భాస్కర్, నరసింహమూర్తి, నారాయణస్వామి, ఉషారాణి ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా బి.నరసింహులు, బాలాజీ, వెంకటనారాయణ, భాగ్యలక్ష్మీ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రామునాయక్, ఆడిట్ కమిటీ సభ్యులుగా వెంకటేశులు, నారాయణస్వామి ఎన్నికయ్యారు.

బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడదాం

బత్తలపల్లి: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడదామని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలుర పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలన, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాలల హక్కుల రక్షణ చట్టం– 2015పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బందితో కలిసి 365 మంది విద్యార్థులతో ఒక్కో గ్రూపు 20 మంది ప్రకారం 11 – 14 సంవత్సరాల వయస్సు వారిని ప్రత్యేకంగా గ్రూపుగానూ, 15 –18 సంవత్సరాల వయస్సు వారిని ఒక గ్రూపుగానూ ఏర్పాటు చేశారు. అనంతరం వివిధ అంశాలపైన విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ఇతర ప్రలోభాలకు గురై ఇబ్బందులపాలు కావొద్దని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీఓ లలితమ్మ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మీ, ప్రసన్నలక్ష్మీ, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రవిచంద్ర, సూపర్‌వైజర్ ఎర్రమ్మ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్దెలచెరువు సూరికి నివాళి





సూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం, రక్తదాతలకు మెమెంటోలు అందిస్తున్న గంగుల భానుమతి

కనగానపల్లి: మద్దెలచెరువు గ్రామంలో బుధవారం దివంగత నేత గంగుల సూర్యనారాయణ రెడ్డి (మద్దెలచెరువు సూరి) జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సూరి భార్య గంగుల భానుమతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై సూర్యనారాయణరెడ్డికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూరి ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు అభిమానులతో కలసి కేక్ కట్ చేశారు. అనంతరం సూరి అభిమానులు రక్తదానం చేశారు. కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అంకె లక్ష్మన్న, జెడ్పీటీసీలు మారుతిప్రసాద్, శ్రీలక్ష్మి, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు 'పురం'లో గణేశ్ నిమజ్జనం

హిందూపురం/హిందూపురం టౌన్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా హిందూపురం పట్టణంలో గణేశ్ నిమజ్జనాన్ని గురువారం నిర్వహించనున్నారు. గుడ్డం కోనేరులో నిమజ్జనం చేయడానికి అన్ని ఏర్పాట్లూ చేశారు. ఎంజీఎం స్కూల్ వైపు నుంచి కోనేరు పక్కకు రావడానికి బారికేడ్లు నిర్మించారు. చిన్న విగ్రహాలను చిన్నకోనేరులో నిమజ్జనానికి సిదన్నేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. భారీ విగ్రహాలను మాత్రం పెద్ద కోనేరులో క్రేన్‌ద్వారా నీటిలో నిమజ్జనం చేస్తామంటున్నారు.

14న ఉచిత కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 14న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగభూషణ, కోశాధికారి నరేంద్రరెడ్డి, క్యాంపు చైర్మన్ డాక్టర్ నరసింహులు తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో బుధవారం రోటరీక్లబ్ సభ్యులు కంటి వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరులోని శంకర్ కంటి ఆస్పత్రి వైద్యులతో ఉచితంగా కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించి చూపు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, సోలిగాళ్ల వెంకటేషులు, రమేష్‌బాబు, పెద్దారెడ్డి, శివయ్య, హరినాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న పీడీ ప్రమీల

పుట్టపర్తి అర్బన్: మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఐసీడీఎస్ పీడీ ప్రమీల పేర్కొన్నారు. బుధవారం ప్రశాంతిగ్రామంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మహిళా చట్టాల ప్రాధాన్యత, ఉపయోగాలపై ప్రజలకు వివరించాలన్నారు. బేటీ బచావో–బేటీ పడావో, బాల్య వివాహాలు, గర్భస్రావాలు, మాతా శిశు సంరక్షణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ జయంతి, డీహెచ్‌ఈఓ రామలక్ష్మి, కౌన్సిలర్ ఉమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ పాటించాలి

ఎన్పీకుంట: సస్యరక్షణ పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయశాఖ అధికారి లోకేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని ధనియానిచెరువు, వంకమద్ది గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి సాగు చేసిన వరి పంటను సందర్శించారు. అక్కడక్కడా రసం పీల్చే పురుగులు, ఆకుముడుత పురుగు, పొటాష్ లోపం ఉన్నట్లు గుర్తించి, ప్రస్తుతం చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులను వివరించారు.

వికసించిన బ్రహ్మ కమలం



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

బత్తలపల్లి: ఏడాదిలో ఒకసారి పూసే బ్రహ్మ కమలం మంగళవారం రాత్రి విరబూసింది. మండల కేంద్రమైన బత్తలపల్లిలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న కుమ్మర లక్ష్మీనరసమ్మ ఇంట్లో ఈ పుష్పం వికసించింది. చెట్టును నాటి సంవత్సరం అవుతోందని, ఇదే తొలి పుష్పమని వివరించారు. అద్భుతమైన వాసనతో ఉండే బ్రహ్మ కమలం అర్ధ రాత్రి సమయంలో వికసించినట్లు తెలిపారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి

గాండ్లపెంట: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి మహేశ్వరమారుతి తెలిపారు. వేపరాలలో బుధవారం టీకాలు, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో వర్షపు నీరు నిలిచి దోమలు వ్యాపించకుండా చూసుకోవాలన్నారు. ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉండగలమన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకుంటే రోగ నిరోధకశక్తి ఉంటుంన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు సురక్షితమన్నారు. దోమలు నివారణకు దోమ తెరలు లేదా వేపాకు పొగ వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు రాజేశ్వరి, శిరీష, ఆరోగ్య కార్యకర్తలు సీతమ్మ, పుష్ప, భవాని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'కూటమి'లో విభేదాలు బట్టబయలు

కొత్తచెరువు: కేశాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్షునిగా నియమితులైన బాబయ్య బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి హాజరయ్యారు. చైర్మన్ స్థానాన్ని కూటమిలో జనసేన పార్టీ వారికి కేటాయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జనసేనలోని ఒక సామాజికవర్గం వారు మినహాయిస్తే టీడీపీ, బీజేపీ నుంచి ఎవ్వరూ హాజరు కాలేదు. దీంతో ఆ పార్టీలో విభేదాలు ఉన్నట్లు బహిర్గతమైంది.

సంక్షిప్త సమాచారం

10న మండల సర్వసభ్య సమావేశం

బత్తలపల్లి: ఈ నెల 10న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన జరిగే మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు అందరూ హాజరు కావాలని కోరారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో రావాలన్నారు.

పరిశ్రమల ఏర్పాటుపై నేడు సదస్సు

గాండ్లపెంట: స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ నాగరాజు బుధవారం తెలిపారు. ఔత్సాహిక వ్యాపార, పారిశ్రామిక వేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

5న శాంతి ర్యాలీ

కదిరి అర్బన్: మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు మిలాద్ కమిటీ కార్యదర్శి మక్బుల్ అలీఖాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు అనిమియ మసీదు నుంచి ర్యాలీ ప్రారంభమై నానాదర్గా, ఇక్బాల్ రోడ్, మెయిన్‌రోడ్, బైపాస్ రోడ్డు మీదుగా తిరిగి అనిమియ మసీదు వద్దకు చేరుకుంటుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. ప్రజలంతా శాంతి ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గుమ్మనూరు నోటిదురుసుపై మండిపాటు

కదిరి టౌన్: గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నోటిదురుసుపై సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. గుత్తి, పామిడి మండలాల్లో సోలార్ విండ్ పవర్ ప్రాజెక్టు కోసం, రైతులను బెదిరించి చేపట్టిన భూ సేకరణ విషయంపై క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే ఫోన్‌లో నోటికొచ్చినట్లు మాట్లాడం సరికాదన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

ముదిగుబ్బ: ముదిగుబ్బలోని పడమర ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న అంధ ఉపాధ్యాయుడు నరసింహులు (58) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ బుధవారం అనంతపురం సర్వజన ఆస్పత్రిలో మృతి చెందారు. ఈయన మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించండి

ఓడీచెరువు: మండల కేంద్రంలో జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలు నెలకొల్పడానికి స్థలం కేటాయించాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు షబ్బీర్ బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రసూల్ సాబ్, క్రిష్టమూర్తి, దాదాపీర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చౌక బియ్యం సీజ్

తనకల్లు: మండల కేంద్రంలోని ఓ హోటల్ అక్రమంగా ఉంచిన 169 కిలోల చౌక బియ్యాన్ని బుధవారం సీఎస్‌డీటీ వెంకటరెడ్డి సీజ్ చేశారు. సివిల్ సప్లై గొడౌన్‌లో పనిచేస్తున్న ప్రైవేట్ ఉద్యోగి బియ్యాన్ని అక్రమంగా అమ్ముతున్నట్లు ఫిర్యాదు రావడంతో రెవెన్యూ అధికారులు హోటల్‌లో తనిఖీ చేసి చౌక బియ్యాన్ని పట్టుకున్నారు. సీజ్ చేసిన బియ్యాన్ని సివిల్ సప్లయీస్ గొడౌన్‌కి తరలించినట్లు సీఎస్‌డీటీ తెలిపారు.